## భీమన్న ఆలయంలో చోరీ

### కంచు, వెండి విగ్రహాల అపహరణ


భీమదేవర ఆలయం

దహెగాం,మార్చి 25: చౌవక పంచాయతీ పరిధిలోని యేటిగూడ భీమన్న ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు కంచు, వెండి విగ్రహాలను ఎత్తుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి.. ఆలయ పూజారి నాయిని చిన్నన్న ఆదివారం ఉదయం పూజలు చేసేందుకు ఆలయానికి వెళ్లాడు. ఆవరణలో పసుపు, కుంకుమతో గుండం పోసి ఉండడాన్ని గమనించి గ్రామస్తులకు తెలియజేశాడు. వారితో కలిసి గుడి లోపలికి వెళ్లగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. కంచు, వెండి విగ్రహాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

## ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

ఆసిఫాబాద్,మార్చి 25: జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనను అలవరుచుకోవాలని ఆసిఫాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి సూచించారు. లిగల్ సర్వీసెస్ జిల్లా చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ అధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఖైదీలకు చట్టాలు, జీవన విధానంపై మూడురోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని మాట్లాడుతూ నేరాల్లో చిక్కుకొని జైలు జీవితం గడుపుతున్న వారు కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. బాధ్యతగా వ్యవహరిస్తూ సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. నేరప్రవృత్తి ని వీడి ప్రశాంత జీవనాన్ని అలవరుచుకోవాలని కోరారు. బెయిల్‌కు అర్హత ఉన్న ఖైదీలు షూరిటీలు సమర్పిస్తే వెంటనే బెయిల్ మంజూరు చేస్తామని చెప్పారు. ఇక్కడ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి


దండేపల్లి : మామిడిపెల్లిలో సంబురాల్లో మహిళలు


మంచిర్యాల : హోలీ వేడుకల్లో మంచిర్యాల డీసీపీ, ఏసీపీ


చెన్నూర్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన రాంలాంల్ గిల్డా దంపతులు


రామకృష్ణాపూర్ : పట్టణ ఎస్ రాజశేఖర్‌కు రంగులు పూస్తున్న క్రీడాకారులు

# 'కలర్ ఫుల్' జోష్

- ఊరూరా అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- రంగులతో సందడి చేసిన చిన్నారులు
- పలుచోట్ల యువతీ యువకుల కేరింతలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**మంచిర్యాల జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. సోమవారం చిన్నాపెద్దా తేడా లేకుండా పరస్పరం రంగులు పూసుకున్నారు. యువతీ యువకులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.**

**మంచిర్యాల ఏసీసీ/దండేపల్లి/జన్నారం/తాండూరు/మందమర్రి/వేమనపల్లి/కన్నెపల్లి/చెన్నూర్‌టౌన్/లక్షెట్టిపేట/నెన్నెల/రామకృష్ణాపూర్/ కోటపల్లి/హాజీపూర్/శ్రీరాంపూర్, మార్చి 25 :** మంచిర్యాల పట్టణంలో ప్రజలతో పాటు పోలీసులు, నాయకులు, అధికారులు అంతా కలిసి ఆనందంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సమీప గోదావరి నదికి వెళ్లి స్నానం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుకు స్థానికులు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ వద్ద, టీఎన్జీవో భవనం వద్ద టీఎన్జీవోఎస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి భముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు రాంకుమార్, తిరుపతి, సంయుక్త కార్యదర్శి ప్రభు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు లక్ష్మణ్, బెల్లంపల్లి అధ్యక్షుడు వెంకటేశ్, ప్రణవ్ పాల్గొన్నారు. దండేపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంబురాలు అంబరాన్నంటాయి. జన్నారంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో వ్యాపారులు వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్, ఎంఈవో విజయ్‌కుమార్, నాయకులు జాజాల శ్రీనివాస్, సత్యనారాయణ నగురు, సుధాకర్‌నాయక్, చెట్‌పెల్లి క్రిష్ణ, వొజ్జల వామన్ పాల్గొన్నారు. తాండూరులో మండలం మాదారం వీధుల్లో గ్రామస్తులు భజన కీర్తనలు పాడుతూ హోలీ వేడుకలు నిర్వహించారు. మందమర్రి పట్టణంలోని మార్కెట్, పాలచెట్టు ఏరియా, ప్రాణహిత కాలనీ, శ్రీపతినగర్, దీపక్‌నగర్, రామన్‌కాలనీ, విద్యానగర్, పాతబస్టాండ్, యాపల్ ఏరియా, అంగడిబజార్ ఏరియాల్లో సంబురాలు జరిగాయి. సింగరేణి పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి ఇంటికి వెళ్లి రంగులు చల్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మొదటి జోన్ కాలనీకి చెందిన టీబీజీకేఎస్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి రాజశేఖర్ ఇంటికి వెళ్లి రంగులు చల్లి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు రెండో జోన్‌లోని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఇంటికెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో ఆదివారం రాత్రి కామ దహన కార్యక్రమం నిర్వహించారు. చెన్నూర్ పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన గిల్డా, కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, ప్రజలు పాల్గొన్నారు. లక్షెట్టిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ చంద్రకుమార్ సిబ్బందితో పాటు చిన్నారులతో కలిసి హోలీ నిర్వహించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లో పట్టణ ఎస్ఐ రాజశేఖర్ నృత్యం చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని వాటర్ ట్యాంక్ ఏరియా, ఆర్‌కే 6గుడిసెలు, శ్రీరాంపూర్ ఏరియా గనులపై, గాంధీనగర్, క్రిష్ణాకాలనీ, ఆర్‌కే 8కాలనీ, అరునక్కనగర్, శ్రీరాంపూర్ కాలనీలో కార్మికులు, కార్మిక కటుంబాలు, ప్రజలు, వ్యాపారస్తులు, టీబీజీకేఎస్ నాయకులు హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. 9వ వార్డు వాటర్ ట్యాంక్ ఏరియాలో నస్పూర్ మాజీ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్ లంబాడాలతో కలిసి నృత్యాలు చేశారు. ఇక వేమనపల్లి, కన్నెపల్లి, నెన్నెల, కోటపల్లి, హాజీపూర్ మండలాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.


మంచిర్యాలలో రంగులు పూసుకుంటూ యువకుల సందడి


జన్నారం : పొనకల్‌లో హోలీ వేడుకల్లో యువతీయువకులు


కలెక్టరేట్ వద్ద సంబురాల్లో ఉద్యోగులు


కోటపల్లిలో హోలీ వేడుకల్లో..


తాండూరు : హోలీ వేడుకల్లో యువకులు

## అన్ని వర్గాలకు వరం

# ఎన్‌ఎల్‌ఎం

- నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌తో స్వయం ఉపాధికి భరోసా
- గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకం,పశువుల దాణా తయారీకి యూనిట్లు
- ఏ యూనిట్‌కైనా 50 శాతం రాయితీ
- పోర్టల్ nlm.udayamimitra.inలో దరఖాస్తులకు అవకాశం



మంచిర్యాల అర్బన్, మార్చి 25 : ప్రభుత్వం రైతులు, సహకార సంఘాలు, నిరుద్యోగులకు ఉపాధి చూపడమే కాకుండా వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకాన్ని తీసుకువచ్చింది. ఈ మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకంతో పాటు పశువుల దాణా తయారీ యూనిట్లు కేటాయిస్తోంది. ఒక్కో యూనిట్ విలువ రూ. 20 లక్షల నుంచి రూ. కోటి వరకు ఉంటుంది. ఇందులో ప్రభుత్వమే సగం రాయితీ ఇస్తుంది. గతంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినా రుణ వ్యయం ఎక్కువగా ఉండడంతో ఆశించిన స్థాయిలో రైతులు ముందుకు రాలేదు. దీంతో విధి, విధానాలు మార్పు చేసింది. నూతన పాలసీ ప్రకారం ఒక యూనిట్‌కు రూ. 20 లక్షలు నుంచి రూ. కోటి వరకు రుణ సాయం అందించనున్నది. ఈ పథకం గొల్ల, కుర్మలకే కాకుండా అన్ని సామాజిక వర్గాల వారికీ రుణం అందించనున్నది. పశుసంవర్ధక శాఖ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రుణ సాయం అందించనున్నారు. 2021-22లో ప్రారంభమైన ఈ పథకం 2026-27 వరకు అమల్లో ఉంటుంది.

**అర్హులు వీరే...**

- మాంసం ఉత్పత్తిని పెంచడానికి ఉద్దేశించిన ఈ పథకానికి అన్ని సామాజిక వర్గాల వారు అర్హులు.
- యూనిట్ స్థాపనకు సరిపడా సొంత స్థలం లేదా లీజు స్థలం కలిగి ఉండాలి. (2 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు)
- 18 నుంచి 55 ఏండ్లలోపున్న వారు nlm.udayamimitra.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఒక కుటుంబం నుంచి ఎందరైనా యూనిట్లు పొందవచ్చు.
- ఆన్‌లైన్ దరఖాస్తులను పశుసంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.
- రుణం ఇచ్చేందుకు బ్యాంకర్ల అనుమతి తప్పనిసరి.
- ఐదు విభాగాల్లో దేనికైనా దరఖాస్తు చేసుకొని రుణం తీసుకోవచ్చు.

**గతంలో...**

జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా గతంలో రూ. కోటి రుణంలో 50 శాతం (రూ. 50 లక్షలు) రాయితీ కింద ఇచ్చేవారు. మిగితా 50 శాతంలో బ్యాంకు ద్వారా రూ. 40 లక్షలతో పాటు లబ్ధిదారుడు రూ. 10 లక్షలు చెల్లించాల్సి ఉండేది. ఈ పథకంలో దరఖాస్తు చేసుకుంటే 500 ఆడ, 25 మగ జాతి గొర్రెలను కొనుగోలు చేయాల్సి వచ్చేది. షెడ్డు నిర్మాణం, దాణా కోసం పశుగ్రాసం పెంచాలి. ఇది వ్యక్తిగతంగా, సంఘంగా ఉండి కూడా రుణం పొందవచ్చు.

**ఐదు విభాగాలుగా...**

గతంలో కోటి రూపాయలు రుణంగా ఇచ్చేవారు. ఇది పెద్ద మొత్తం కావడంతో లబ్ధిదారులు సమకూర్చుకోలేరని, బ్యాంకులు కూడా రుణం ఇవ్వలేవన్న విషయం ప్రభుత్వం దృష్టికి రాగా ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ఇటీవల రుణం మంజూరు నిబంధనలను మార్పు చేసింది. ఐదు విభాగాలుగా యూనిట్లను విడదీసింది.

- గొర్రెలు, మేకల పెంపకం యూనిట్ : 105 (100 గొర్రెలు, 5 పొట్టేళ్ల) గొర్రెలకు రూ. 20 లక్షలు, 210 (200 గొర్రెలు, 10 పొట్టేళ్ల) గొర్రెలకు రూ. 40 లక్షలు, 315 (300 గొర్రెలు, 15 పొట్టేళ్ల) గొర్రెలకు రూ. 60 లక్షలు, 420 (400 గొర్రెలు, 20 పొట్టేళ్ల)గొర్రెలకు రూ. 80 లక్షలు, 525 (500 గొర్రెలు, 25 పొట్టేళ్లు) గొర్రెలకు రూ. కోటి అందించనున్నది. ఇందులో 50 శాతం సబ్సిడీ పోను 50 శాతం బ్యాంకు గ్యారంటీ ఉంటుంది.
- కోళ్ల ఫారం ఏర్పాటు : 250 కోడి పెట్టలు, 25 పుంజుల పెంపకం విలువ రూ. 25 లక్షలు కాగా, అందులో ప్రభుత్వం రూ. 12.5 లక్షల సబ్సిడీ అందిస్తుంది. వెయ్యి కోడి పెట్టలు, 100 పుంజులకు రూ. కోటి కాగా, రూ. 50 లక్షలు సబ్సిడీ ఇస్తుంది. మిగితావి బ్యాంకు రుణంగా కాని, స్వయంగా కాని సమకూర్చుకోవాలి.
- పశుగ్రాసం తయారీ యూనిట్ : పశుగ్రాసం తయారీ యూనిట్ కోసం సైలేజీ తయారీ యూనిట్, పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్, సమీకృత దాణా తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ ప్రాజెక్టులకు రూ. 50 లక్షల వరకు రాయితీ ఇస్తారు. రూ. కోటి, అంతకన్నా ఎక్కువైనా రూ. 50లక్షలు, అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ అందజేస్తారు.
- పందుల పెంపకం : పందుల పెంపకానికి 50 ఆడ, 12 మగ పందుల యూనిట్‌కు రూ. 30 లక్షలు కాగా, రూ. 15 లక్షలు సబ్సిడీ వస్తుంది. 100 ఆడ పందులు, 25 మగ పందులకు రూ. 60 లక్షలు కాగా, రూ. 30 లక్షలు సబ్సిడీ వస్తుంది. అయితే తీసుకున్న యూనిట్‌లో సబ్సిడీని ప్రారంభంలో 50 శాతం, మిగిలిన సబ్సిడీని రెండేళ్ల తర్వాత బ్యాంకులో జమ చేస్తారుచేస్తారు.

**ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి**



జీవాల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారులకు యూనిట్‌నుబట్టి రెండు నుంచి పది ఎకరాల వరకు సొంత లేక లీజు భూమి ఉండాలి. ఏ యూనిట్‌కైనా 50 శాతం సబ్సిడీ పోను 50 శాతం బ్యాంకు గ్యారంటీ లేదా రుణం అనుమతి పొందవచ్చు. రైతుల ఆర్థికాభివృద్ధికి ఈ ఎన్ఎల్ఎం పథకం దోహదపడుతుంది. నిరుద్యోగులు, రైతులకు ఇది మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి.

**- డాక్టర్ రమేశ్‌కుమార్, డీవీఏహెచ్‌వో, మంచిర్యాల**


రవీంద్రభారతీలో బహుమతి అందుకుంటున్న రాజేశ్వర్‌రావు

## కవితల పోటీల్లో రాజేశ్వర్‌రావు ప్రతిభ

లక్షెట్టిపేట, మార్చి 25: పట్టణానికి చెందిన కవి లేదాళ్ల రాజేశ్వర్‌రావు డాక్టర్ బట్టిప్రోలు దుర్గా లక్ష్మీప్రసన్న స్మారక వచనా కవితల పోటీల్లో ప్రతిభ కనబరిచి కన్సోలేషన్ బహుమతి గెలుచుకున్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న ఆయన ఇనుపపెట్టి అనే కవితను రాసి శభాష్ అనిపించుకున్నారు. ప్రముఖ కవులు డాక్టర్ శిఖామని, శివారెడ్డి, వాడ్రెపు చినవీరభద్రుల చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. కవి రాజేశ్వర్‌రావుకు సాహితీ స్రవంతి అధ్యక్ష, కార్యదర్శులు ల్యాదాల గాయిత్రీ, నూటెంకి రవీంద్రతో పాటు స్థానిక కవులు గోపగాని రవీందర్, కందుల తిరుపతి, రాచకొండ శ్రీనివాస్, వేనంక చక్రవర్తి, ముత్యం మల్లేశం, అబ్దుల్ గఫార్, సుబ్బాయమ్మ, భారతి, లేదాళ్ల జయ అభినందనలు తెలిపారు.

## కాల భైరవుడికి పెద్దపల్లి జడ్జి పూజలు


కాలభైరవుడిని దర్శించుకున్న అర్జున్

కోటపల్లి, మార్చి 25 : మండలంలోని పారుపల్లి గ్రామం సమీపంలోని భైరవకోనపై వెలసిన భైరవుడికి పెద్దపల్లి అసిస్టెంట్ సెషన్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## దీక్ష విరమణ

కాగజ్‌నగర్, మార్చి 25: లారీ ఆసోసియేషన్, పేపర్ మిల్లు యాజమాన్యం మధ్య సోమవారం జరిగిన చర్చలు ఫలప్రదమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే కోనప్ప లారీ అసోసియేషన్ ప్రతినిధులు, పేపర్ మిల్లు జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి, సినీయర్ మేనేజర్ రమేశ్ రావు, ప్రతినిధులు బియాని, మిశ్రాతో ఎస్పీఎం క్లబ్‌లో రాత్రి చర్చలు జరిగాయి. వచ్చే నెల నుంచి అన్‌లోడింగ్, టోల్ గేట్ చార్జీలు మిల్లు భరిస్తుందని ఒప్పుకున్నట్లు లారీ అసోసియేషన్ బాధ్యులు స్పష్టం చేశారు. చర్చ లు సఫలం కావడంతో మాజీ ఎమ్మెల్యే లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

## లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి..


మంచిర్యాల ఫైర్ స్టేషన్ వద్ద నిరుపయోగంగా ఉన్న షీ టాయిలెట్లు


మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన వద్ద నిరుపయోగంగా ఉన్న షీ టాయిలెట్లు

**మంచిర్యాల జిల్లా కేంద్రంలో లక్షలాది రూపాయలతో నిర్మించిన షీ టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. 2017లో అప్పటి కలెక్టర్ కర్ణన్ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ పక్కన, ఫైర్ స్టేషన్, బస్ స్టేషన్ ఆవరణల్లో, ప్రభుత్వ దవాఖాన వద్ద షీ టాయిలెట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఒక్కో దానికి రూ. 3.50 లక్షలతో పాటు బోర్‌వెల్ ఏర్పాటుకు అదనంగా మరో రూ. లక్ష చొప్పన కేటాయించగా, అన్ని చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. నిర్వహణ లోపంతో అవి పనికిరాకుండా పోయాయి. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.**

– మాదరబోయిన శ్రీనివాస్, మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ కైలాస్

నెన్నెల,మార్చి24 : నెన్నెలలోని పోలీస్ స్టేషన్ ప్రాంతానికి చెందిన జంగేటి కైలాస్ అనే హమాలీపై కుక్క దాడి చేసింది. సోమవారం సాయంత్రం కైలాస్ స్థానిక భీరన్న చెట్టు వద్ద కూర్చుని ఉండగా ఒక్కసారిగా కుక్క పైకి దూకి కరిచింది. స్థానికులు దానిని తరిమి కొట్టడంతో పారిపోయింది. కైలాస్ ఎడమ కన్ను పై లోతైన గాయమైంది. అతడిని బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. అంతకు ముందు రెండు పశువులపై కూడా కుక్కలు దాడి చేసి గాయా పర్చాయి. ఈ వారంలో ఐదుగురిపై కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు చెప్పారు.